# కన్నప్రేమా! నీ ఖరీదెంత?

శ్రీ మధుర్‌జీ



## ఆనంద భవన్

అధునాతనంగా, ఆకర్షణీయంగా, ఖరీదుగా, ఠీవిగా ధనవంతుని దర్పంలా వుంది. చుట్టూ అశేషంగా పరుచుకున్న పూరి గుడిసెల మధ్య గర్భ దరిద్రుల నడుమ ఆగర్భ శ్రీమంతునిలా వుంది. బడుగు జీవుల మొండి గోడల కొంపల మధ్య మహారాజుల పాల రాతి మేడలా దర్జాగా వుంది.

తూర్పున వెలుగు రేకలు విచ్చుకుంటున్న వేళ.

ఖరీదైన హాల్లో విదేశీ గోడ గడియారం సంగీతాన్ని మేళవించి ఆరు గంటలతో మేలుకొలుపులు పాడుతున్న వేళ.

సరిగ్గా అదే వేళకు మూడో అంతస్థులో ఆరో నెంబరు గదిలో విదేశీ అలారం విన సొంపుగా మ్రోగుతోంది.

అప్పటికే నిద్ర లేచిన ఆరేళ్ల వికాస్ నిద్ర కళ్లతో గోడ మీదున్న రంగు రంగుల క్యాలెండర్‌ను నిర్లిప్తంగా గమనిస్తున్నాడు. మరో మంచంలో తొమ్మిదేళ్ల విరిత యింకా తృప్తిగా నిద్ర పోతూనే వుంది. కిటికీలో నుండి తెరలు తెరలుగా వస్తున్న పిల్ల గాలులకు క్యాలండర్ మీదున్న రంగుల బొమ్మలు గమ్మత్తుగా కదులుతున్నాయి.

క్యాలండర్‌మీద ఎవరో అమ్మా, నాన్నలు ఆనందంగా వున్నారు. నాన్న గుర్రంలా మోకాళ్ల-మీద వంగుంటే నాలుగేళ్ల పిల్లవాడు వీపుమీద రౌతులా స్వారీ చేస్తున్నాడు. ఆ పిల్లవాని కన్నుల్లో ప్రపంచాన్ని జయించినంత విజయగర్వం.

అమ్మ మెడ చుట్టూ చేతులు వేసి కావలించుక వేలాడుతున్న ఆరేళ్ల బాలిక. ఆ బాలిక మొహంలో సంతోషం పొంగి పొర్లుతోంది. ఆ అమ్మా నాన్నలు ప్రపంచాన్నే మరచిపోయి తమ పిల్లల మొహాల్లో వెలిగి పోతున్న కాంతి పుంజాలను ఆనందంతో గమనిస్తున్నారు.

వికాస్ తదేకంగా ఆ క్యాలండర్‌ను గమనిస్తు-న్నాడు. ఎందుకో ఎంత సేపు చూచినా మళ్లీ మళ్లీ చూడాలని ఉంటుందేమో ఆ దృశ్యాన్ని.

వికాస్ మనసులో అకస్మాత్తుగా అమ్మా నాన్న మెదిలారు. ఆ చిన్నారి కళ్లలో ఓ క్షణం మెరుపు మెరిసింది. కానీ ఆ మెరుపు కేవలం ఒక్క క్షణమే. మరుక్షణం చీకటి ఆవరించింది.

స్ప్రింగ్ తలుపు మెల్లగా తెరుచుకుంది. తెరుచు-కున్న తలుపులగుండా ఎవరొస్తారో వికాస్‌కు తెలుసు.

ఆయా సరస్వతమ్మ!

సరస్వతమ్మకు నలభై ఏళ్ళుంటాయి. వికాస్ పుట్టుకకు ముందే ఆనందభవన్‌లో ప్రవేశించిది. సరస్వతమ్మ భర్త రాజయ్య అయ్యగారి కారు డ్రైవర్. మొదట్లో సరస్వతమ్మ వంట పనులవీ చూస్తున్నా విరిత, వికాస్‌లు పుట్టిం తర్వాత వాళ్లిద్దరికీ ఆయా అయ్యింది. పిల్ల లిద్దరి అవసరాలు దగ్గరుండి చూడటం ఏ క్షణం ఏం కావలసినా క్షణాల్లో వారి కవి అమర్చటం వారు ఆరు గంటలకు నిద్ర లేచింది మొదలు మళ్లీ తొమ్మిది గంటలకు నిద్రలోకి జారుకునే దాకా అన్నీ సరస్వతమ్మ చేతుల మీదుగా జరగాలి. సరస్వతమ్మ జీవితంలోవిరిత, వికాస్‌లు ఓ ప్రధాన భాగం.

'అమ్మాయిగారూ.... ఆరు గంటలయింది లెగండమ్మా....చూడు వికాస్ బాబుగారు అప్పుడే నిద్ర లేచారు కూడా.... ఊఁ ఊఁ.... లెగండి విరితమ్మాయిగారూ..... అమ్మగారికి తెలిస్తే నన్ను కోప్పడతారు....'

'అప్పుడే సిక్స్ అయ్యిందా ఆయా.....'

'ఆరు దాటి పోయిందమ్మాయిగారూ....'

విరిత కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది. వికాస్ అప్పటికే మంచం దిగి కిటికీ దగ్గర నుంచుని తోటలోకి చూస్తున్నాడు. తోటలో అవుట్ హవుస్ ప్రక్కనున్న సరస్వతమ్మ గుడిసె కనబడుతోంది. గుడిసె ముందు కుక్కి మంచంలో సరస్వతమ్మ భర్త డ్రైవర్ అంజయ్య వెల్లకిలా ఆకాశం చూస్తూ పడుకున్నాడు. రాజయ్య గుండెల మీద కూర్చుని దట్టంగా పెరిగిన మీసాలు పెరుకుతున్నాడు. సరస్వతమ్మ కొడుకు ఐదేళ్ల చిన్నయ్య.

'అరే వెధవా! యిదేం ఆటరా... వుండు నీ పని చెప్తా....' రాజయ్య చిన్నయ్య చెవి పట్టుకో బోయాడు. కానీ వాడు హఠాత్తుగా మంచం దూకి తూనీగలా పరుగు లంకించుకున్నాడు. చిన్నయ్యను వురికి పట్టుకోబోయి మంచం పట్టె కాలికి తగిలి మంచంలో బోర్లా పడ్డాడు రాజయ్య.

దూరంగా నిలబడి చప్పట్లు కొడుతూ పక పకా నవ్వుతున్నాడు చిన్నయ్య. వికాస్ కూడా చప్పట్లు కొడుతూ కిల కిలానవ్వుతూన్నాడు.

'ఏంటి బాబుగారూ....బలే నవ్వుతున్నారు...'

'అదిగో అటు చూడు ఆయా....' సరస్వతమ్మ కిటికీలో నుండి తోటలోకి చూచింది.

'మా చిన్నయ్య వాళ్ల నాన్నను ఆట పట్టిస్తు న్నాడు మా వా డొట్టి అల్లరి వెధవ బాబూ.... వాడికి చదువూ గిదువూ వంట బట్టేట్టు లేవు'

వికాస్ మనసులో అమ్మా నాన్నలు మెదిలారు.

నవ్వుతున్న పెదవులు హఠాత్తుగాఆగిపోయాయి.

వికాస్, విరితల స్నానాలు దగ్గరుండి చేయించింది సరస్వతమ్మ. ఇద్దరికీ ఖరీదైన బట్టలు వేసింది. నీడలు కనబడే బూట్ వేసింది. విదేశీ సెంట్లు

# చిరునవ్వు

మురిపించే చిరునవ్వు
నాకు దూరం కాకు నువ్వు!
సుదీర్ఘమైన ఈ జీవన యానంలో
కష్టాలు ఎన్ని ఎదురైనా
కక్షలూ కార్పణ్యాలు నన్ను
వేపిరించినా

కుంగి పోక లొంగిపోక
జయించే శక్తి నీకుంది
అదే నాకు కావలసింది!
హృదయంలో అగ్ని పర్వతాలు
బద్దలవుతున్నా
మనసు మమతా మనుషుల
అసూయాగ్నిలో పడి
మాడి మసవుతున్నా
బంధనాల బాహువుల్లో బతుకు చితికి
పోతున్నా

అన్నీ మరపించే చిరునవ్వు
నాకు దూరం కాకు నువ్వు!
లోకం నన్ను కాదన్నా
తోడింకెవరూ లేకున్నా
నీవు జోడుగా వుంటే చాలు
నేను నిండుగా వుండగలను
నువ్వుంటే ఆరోగ్యం
నువ్వుంటే ఆనందం
నువ్వే ఒక అందం
నీ నీడలో ఎక్కొచ్చును అందలం
మురిపించే చిరునవ్వు
నాకు దూరం కాకు నువ్వు!

— శారదా అశోకవర్ధన్

## కన్న ప్రేమా నీ ఖరీదెంత?

పూసింది. శుభ్రంగా, అందంగా తలలు దువ్వింది. విరిత జడలో గులాబీని సుతారంగా అమర్చింది. వికాస్‌కు టై బిగించింది.

వికాస్ విరితలు

మంచి ముత్యాల్లా మెరిసి పోతున్నారు.

నందనంలో విరిసిన పారిజాతాల్లా వెలిగి పోతున్నారు.

హాల్లోని గడియారం ఎనిమిది గంటలని చెప్పింది సంగీతం వినిపిస్తూ.

డైనింగ్ హాలు.

ప్రత్యేకంగా ఫ్రాన్స్‌నుండి దిగుమతి చేసుకున్న డైనింగ్ టేబులు యజమానుల గొప్పతనానికి సజీవమైన ఉదాహరణలా వారి ఖరీదైన అభిరుచికి తిరుగులేని సాక్ష్యంలా హుందాగా వుంది.

వికాస్, విరిత చెరో కుర్చీలో కూర్చున్నారు.

వికాస్ మాటి మాటికి గుమ్మం తెర వంక చూపులు సారిస్తున్నాడు. కళ్లల .. నిరీక్షణ.

రమేష్ చౌదరిగారు, గాయిత్రీ దేవిగారు ఠీవిగా డైనింగ్ హాల్లో ప్రవేశించారు.

'గుడ్ మార్నింగ్....డాడీ అండ్ మమ్మీ....' ఉత్సాహంగా పలికారు.

'గుడ్ మాణింగ్....గుడ్ మాణింగ్....' మమ్మీ, డాడీ బదులు పలికారు.

వికాస్, విరితలకు యెదురుగుండా కూర్చున్నారు రమేష్ చౌదరి, గాయిత్రీదేవి గారలు. వారికి యెదురుగుండా రక రకాల పదార్థాలు వేడి పొగలు గ్రక్కుతూ, కమ్మని వాసనల్ని వ్యాపింప చేస్తున్నాయి.

'సరస్వతీ....పిల్లలకు వడ్డించు-'

'అలాగేనమ్మగారూ....'

సరస్వతి వడ్డించింది. విరిత తలవంచుకుని తినటం ప్రారంభించింది మౌనంగా. వికాస్ కనీసం ప్లేటు వంక కూడా చూడకుండా తల్లి వంకే కళ్లార్పకుండా చూస్తున్నాడు.

'కమాన్ మై బాయ్....హౌవ్ యువర్ టిఫిన్' గాయిత్రీదేవి చెప్పారు.

'ఉహుం....నాకొద్దు'

'అదేం....?!' – తండ్రి.

'మమ్మీ....తినిపించా...లి' తలవంచుకుని కోరిక బైట పెట్టాడు.

అమ్మ కొసరి కొసరి తినిపిస్తే కడుపునిండా తినాలన్న కోరిక మనసులో బలంగా నాటుకొనేలా చేసింది వికాస్‌కు రాత్రి చిన్నయ్యకు ఆయా సరస్వతమ్మ వెన్నెల్లో గోరు ముద్దలు కొసరి కొసరి తినిపిస్తున్న దృశ్యం.

'వాట్.... నాన్సెన్స్.... వికాస్ నువ్వింకా చిన్న పిల్లాడివి కాదు.... ఊరికే తినెయ్' మమ్మీ తీవ్రంగా చూస్తూ మందలించింది.

'యు ఆర్ నాట్ ఎ కిడ్ మై సన్ – ' నవ్వుతూ భార్యను బలపరిచాడు.

వికాస్ బిక్క మొహ మేసుకున్నాడు. తమ్ముని బిక్క మొహాన్ని చూసి కిసుక్కున నవ్వింది విరిత. వికాస్ మనసు చిన్నబోయింది. రాత్రి ఆ దృశ్యం చూశాక చిన్నారి మనసు ఈ క్షణం కోసం తహ తహ పడింది. కానీ ఆ కోరిక యిలా అపహాస్యానికి గురవుతుందని వికాస్ మనసు ఊహించలేక పోయింది.

'చిన్నయ్యది మాత్రం నా వయసు కాదేంటి....?

వికాస్ ఆ ప్రశ్న యెవ్వరినీ అడగలేదు. మౌనంగా తలవంచుకుని తినటం ప్రారంభించాడు. తల్లి గాని, తండ్రిగాని తనను గమనిస్తున్నారేమోనని ఆశగా కను కొలుకుల్లో నుండి గమనించాడు.

వికాస్ ఆశ నిరాశే అయ్యింది.

గాయిత్రీదేవిగారు తన రాజకీయాల గురించి చెపుతున్నారు.

రమేష్ చౌదరిగారు తన బిజినెస్ గొడవల గురించి చెపుతున్నారు.

'మమ్మీ.... మీరు డాడీ.... సాయంకాలం నాలుగింటికి మా కాన్వెంట్‌కు రావాలి' విరిత చెప్పింది.

'ఎందు కేమిటి ?'

'సాయంకాలం పేరెంట్స్ గెట్ టుగెదర్ ఫంక్షనుంది'

'నాలుగింటికా....బహుశా నాకు కుదరకపోవచ్చు. సరిగ్గా నాలుగింటికే సోషల్ వెల్ ఫేర్ మినిష్టర్‌గారు మురికివాడల్ని విజిట్ చేస్తున్నారు. నేను తప్పని సరిగా దగ్గరుండాలి....మీ డాడీకి వీలయితే రాగలరులే....'

'ఆఁ ఆఁ...చూద్దాం'

బ్రేక్ ఫాస్ట్ ముగిసింది.

'గాయిత్రీ....నేను ఫ్యాక్టరీకి వెడతాను...ఓ అర్జంటు మీటింగుంది....'

'పదండి....పదండి...నేనూ ఓ సారి ఛీఫ్ మినిష్టర్‌గార్ని కలిసి రావాలి...ఉమెన్ వెల్‌ఫేర్ సొసైటీ గురించి ఓ చిన్న లిటికేషనుంది....ఎలాగైనా ఆ అడ్డు తొలగించాలి మనం....చూడు సరస్వతీ! పిల్లలిద్దరినీ జాగ్రత్తగా కార్లో కాన్వెంట్‌కు తీసికెళ్ళు' హడావుడిగా పైపు కాల్చుకుంటూ రమేష్ చౌదరిగారు వెళ్ళిపోయ్యారు.

పట్టు చీర పదే పదే సవరించుకుంటూ గాయిత్రీ దేవిగారు వెళ్ళిపోయ్యారు.

వెళ్ళిపోతున్న అమ్మా నాన్నలను శూన్య దృక్కులతో గమనిస్తున్నాడు వికాస్. ఆ చిన్నారి చూపుల్లో ఎవరికీ అర్థం కాని నిరాశ! ఆ లేత మనసులో కన్నవారి కర్థం కాని చీకటి పొరలు!!

రెండు కార్లూ వెళ్లిపోయిన శబ్దం డైనింగ్ హాల్లోకి వినిపించింది.

'పదరా వికాస్....కాన్వెంట్‌కు టైమవుతోంది' విరిత హెచ్చరించింది. వికాస్ బదులు పలకకుండా అంగీకారంగా తలూపాడు.

సరస్వతమ్మ యిద్దరి స్కూల్ బాక్సులూ సర్దింది. మళ్లీ ముఖాలకు పౌడరద్ది, చెదిరిన ముంగురులు సవరించింది. డ్రైవర్ వచ్చి వినయంగా నిలుచున్నాడు.

'పదండి బాబుగారూ.... పదండమ్మాయిగారూ....

ఇద్దరూ బూట్లు టక టక లాడించుకుంటూ మెట్లు దిగారు. డ్రైవరు తలుపు తెరిచి పట్టుకున్నాడు. వికాస్, విరిత వెనుక సీట్లో కూర్చున్నారు. సరస్వతమ్మ ముందు కూర్చుంది.

కారు కాన్వెంట్ కేసి కదిలింది

వికాస్ కాన్వెంట్‌లో చేరి అప్పుడే ఆరు నెలలు గడిచి పొయ్యాయి క్రొత్తలో కాన్వెంట్‌లో చేరినపుడున్న వుత్సాహంలో నూరవ వంతయినా యిప్పుడు వికాస్‌లో లేదు.

వికాస్‌కు ఎక్కడో ఏదో వెలితి. ఆ వెలితి క్రమ క్రమంగా పెద్దదవుతోంది ఏదో కావాలని మనసు పదే పదే కోరుకుంటోంది. కాని తను కోరుకుంటున్నది ఎలా చెప్పాలో తెలియటం లేదు వికాస్‌కు

క్లాసు మొదలయ్యింది.

మేడమ్ 'మదర్' పాఠం చేపుతోంది. వికాస్ కూడా పుస్తకం తెరిచి పాఠం వింటున్నాడు. పాఠం కంటె ముందు రంగు రంగుల బొమ్మ. బొమ్మలో ఓ తల్లి. ఆ తల్లి కొంగు నీడన దాక్కున్న ఓ కొంటె పిల్లవాడు.

వికాస్ పాఠం వినకుండా ఆ బొమ్మనే నిశితంగా గమనిస్తున్నాడు. ఆ తల్లి మొహంలోకి పరిశీలనగా చూస్తున్నాడు. ఆ తల్లి కళ్ళు కొడుకుమీద వాత్సల్యంతో తారకల్లా మిల మిలా మెరుస్తున్నాయి.

'మరి మమ్మీ కళ్ళు... ఎప్పుడూ అలా.. అలా.. .వుండవేం..... ఆ పసి మనసు అంతరాంతరాల్లో జవాబు లేని ప్రశ్న. జవాబు తెయని ప్రశ్న.

హఠాత్తుగా వికాస్ కళ్ళ ముందు రాజయ్య - చిన్నయ్యల పరుగు మెదిలింది.

తన గదిలో గోడమీదున్న రంగు రంగుల క్యాలండర్‌లోని తల్లి మెదిలింది.

'వికాస్... బి అలర్ట్' మేడం హెచ్చరించింది

వికాస్ మనసును అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించాడు.

మధ్యాహ్నం ఒంటి గంటకు సరస్వతమ్మ క్యారియర్ తెచ్చింది కాన్వెంట్ డైనింగ్ రమూలో యిద్దరికీ వడ్డించింది.

విరిత తన ఫ్రెండ్స్‌తో తెగ కబుర్లు చెపుతూ భోం చేస్తోంది. వికాస్ మౌనంగా తింటున్నాడు

'ఆయా ...మమ్మీ యింటి కొచ్చిందా ...'

'వచ్చారు బాబుగారూ....'

'మరయితే నాల్గుగింటికి ఫంక్షన్‌కు రమ్మన్నామని చెప్పు'

'అలాగే బాబుగారూ. ..'

సాయంకాలం మూడింటికే క్లాసులు ముగిశాయి నాలుగింటికి తల్లి దండ్రుల సమావేశం. చాలమంది తల్లి దండ్రులు ఒక్కొకరే వస్తున్నారు. వారి తల్లి దండ్రుల రాకతో పిల్లల మొహాల్లో ఉత్సాహం వెల్లి విరుస్తోంది.

వికాస్ చూపులన్నీ గేటుమీదే వున్నాయి కారు రాక కోసం. కానీ వికాస ఎదురు చూస్తున్న కారెంతకూ రాలేదు.

వికాస్ మనసులో ఎక్కడో నిరుత్సాహం.

కానీ ఆ కాన్వెంట్‌లో జరుగు ఫంక్షన్‌కు తనను ఛీఫ గెస్ట్‌గా పిలిస్తే తప్ప గాయిత్రీదేవిగారు రారని వికాస్‌కేం తెలుసు పాపం!

పోనీ కనీసం తనకు అక్కర కొచ్చే ఏ చిన్న మినిష్టరుగారు ముఖ్య అతిథిగా వచ్చినా...గాయత్రీదేవిగారు హాజరయ్యే వారు. కేవలం పిల్లల ముచ్చట తీర్చటానికి తన 'విలువైన' కాలాన్ని వృధా చేసుకునే పిచ్చి తల్లీ కాదు సామాన్య గృహిణీ కాదు గాయత్రీదేవిగారు.

ఏ చిన్న ఫంక్షనయినా సరే అది ఏదో విధంగా బిజినెస్‌కు ముడి పడకపోతే రమేష్ చౌదరి గారికి ఆ విషయమే గుర్తుండ దసలు

విరిత వికాస్‌లా సున్నిత మనస్కురాలు కాదు. పైగా వికాస్ కంటె రెండు మూడేళ్ళు పెద్దది. మమ్మీ మనస్తత్వం పూర్తిగా కాకున్నా కొంతైనా అర్థం చేసుకుంది కాబట్టి మమ్మీ కోసం వికాస్‌లా ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నిరీక్షించలేదు. తన ఫ్రెండ్స్‌తో సరదాగా కబుర్లు చెపుతోంది

'వికాస్! అదిగో మా మమ్మీ వస్తోంది' ప్రక్కన కూర్చున్న రాజేంద్ర హుషారుగా బెంచీ దూకి ఎదురు వెళ్లాడు. రాజేంద్ర క్కూడా ఆరేళ్ళకు మించి వుండవు.

రాజేంద్ర తల్లి నడుము చుట్టి వేశాడు కౌగిలించుకుని. ఆమె రాజేంద్ర బుగ్గ మీద సుతారంగా ముద్దు పెట్టుకుంది

ఆ దృశ్యాన్ని చూస్తూ వికాస్ అప్రయత్నంగా తన చెంప తుడుచుకున్నాడు. ఒకసారి గాయిత్రీదేవిగారు యిదే కాన్వెంట్‌కు ఛీఫ్ గెస్ట్‌గా వచ్చారు. ఆమెగారు కారు దిగీ దిగటంతోటే అప్పటికి కేవలం వారం క్రిందటే కాన్వెంట్‌లో చేరిన వికాస్ - తల్లి చెరుగు క్రింద దూరబోయాడు ఆనందంతో అప్పుడామె వికాస్‌ను ముద్దు పెట్టుకోకపోగా అంత మందిలోనూ తీవ్రంగా మందలించింది. వికాస్ చిన్నబోయిన మనసుతో, కళ్ల నీళ్లతో బిక్క చచ్చి నిలబడి పొయ్యాడు. ఆ చిన్నారి మనసు సర్దుకోలేనంతగా గాయ పడిందా క్షణంలో

కొందరు ఎంత పెరిగినా చిన్నారి మనసుల నర్థం చేసుకోలేరు మరి! రాజేంద్ర తల్లిని కౌగలించుకున్నపుడు వికాస్ మనసులో గతించిన గతం కదలాడింది.

రాజేంద్ర వికాస్‌కు తన మమ్మీని పరిచయం చేశాడు. వికాస్ వినయంగా నమస్కరించాడు. బదులుగా వికాస్‌ను దగ్గరకు తీసుకుని నుదుటిమీద గాఢంగా చుంబించింది ఆమె

అనుకోని ఈ ఘటనకు వికాస్ మనసు పులకించింది. తన్మయత్వంగా ఆమె కళ్లలోకి తదేకంగా చూశాడు. ఆ కళ్లలో . వికాస్‌కు తమ మేడమ్ వుదయం చెప్పిన 'మదర్' కనబడింది.

'ఏం బాబూ! మీ మమ్మీగారు రాలేదా... ?'

తియ్యని కంఠం నిండా తరగని ఆప్యాయత. స్పర్శే కాదు ఆ పలకరింపు కూడా సేద తీర్చే మలయ మారుతంలా ఆనందంగావుంది వికాస్‌కు.

'యింకా రాలేదండి... యిక రారేమో....' వికాస్ గొంతులో నిరాశ.

'పోనీ- నే వచ్చేశాగా బాబూ. . యిప్పు డిక నేనే మీ యిద్దరికీ మమ్మీని....'

వికాస్ మొహంలో ముసురుకుంటున్న నిరాశల నీలి నీడలను పసి గట్టి చెదరగొట్టటానికి ప్రయత్నించిందామె. ఆమె ప్రవృత్తి రీత్యా మమతలు పంచి యివ్వగల చల్లని తల్లే కాదు వృత్తి రీత్యా పసి పిల్లల మనస్సుల్ని అవలీలగా చదువగల ఉపాధ్యాయురాలామె.


ఫంక్షన్ మొదలయ్యింది.

వికాస్, రాజేంద్ర ఆమె కటూ యిటూ కూర్చున్నారు. వికాస మనసు ఆనందంతో గంతు లేస్తోంది. తను వెదుకుతున్నది హఠాత్తుగా దొరికినట్లయ్యింది. మమ్మీ రాలేదన్న విషయమే గుర్తుకు రాలేదు వికాస్‌కు ఫంక్షన్ పూర్తయ్యే వరకూ.

కారు వచ్చింది ఆయా సరస్వతితో.

'ఏం బాబూ...నువ్వూ, విరితా ఒక్కసారి మా యింటికి రారాదూ.. .' ఆదరంగా ఆహ్వానించింది ఆమె. ఆమె పిలవకున్నా వెళ్లాలని వుంది వికాస్‌కు.

కానీ-తన పర్మిషన్ లేకుండా ఎక్కడికి వెళ్ళినా మమ్మీ సహించదని తీవ్రంగా మందలిస్తుందని యింతకు మునుపే స్వానభవంలోకి వచ్చింది కనుక తన మనసులోని కోరికను మనసు మూలల్లో



బలవంతంగానైనా సరే దాచుకోక తప్పింది కాదు వికాస్‌కు.

'మళ్ళీ ఎప్పుడయినా వస్తానండి'

'ఆల్ రైట్ అలాగే... తప్పక రావాలి సుమా...'

'నమస్తే' వికాస్ అనుకోకుండా చేతులు జోడించాడు.

ఆమె బదులుగా వికాస్‌కో తీయని ముద్దిచ్చింది

కారు కదిలింది. రాజేంద్ర ఆమె యెక్కిన రిక్షా కదిలింది.

సుఖంగా కారులో కూర్చున్నా యిరుకు రిక్షాలో దాదాపు తల్లి ఒడిలో ఆనందంగా కూర్చుని పయనిస్తున్న రాజేంద్రమీద వికాస్ మనసులో ఎక్కడో రవ్వంత ఈర్ష్య లీ ాకదిలింది.

సాయంకాలం

గార్డెన్‌లో వికాస్, విరిత కాస్సేపు ఆడుకున్నారు. ఆటల్లో కూడా బట్టలు మురికి చేసుకుంటే గాయిత్రీదేవిగారు కోప్పడతారు. మొరటు పిల్లల్లా కాకుండా పొలిష్డ్‌గా ఆడించమని స్ట్రిక్ట్‌గాఆర్డర్స్ జారీ చేశారు.

వికాస్ మనసులో చిన్నయ్యలాసరదాగా మట్టిలో దొర్లి యిసుకలో దూకి ఆడుకోవాలని వున్నా 'కుదరదు' కాబట్టి సరిపెట్టుకోక తప్పదు.

సరస్వతమ్మ యిద్దరికీ స్నానం చేయించింది బట్టలు మార్చింది.

సరిగ్గాఆరు గంటలకు ట్యూషన్ మేడమ్ వచ్చారు. ఎనిమిదింటి వరకు ఆమె ట్యూషన్ చెప్పారు. ఎనిమిదింటికి డైనింగ్ హాల్లో భోజనం అంత విశాలమైన టేబిల్ ముందు వికాస్, విరిత. ఎప్పుడో తప్ప గాయిత్రీదేవిగారు, రమేష్‌చౌదరిగారు ఎనిమిదింటికి యింటికి రారు. మళ్ళీ ఉదయం ఎనిమిది గంటలకు తప్ప మమ్మీ, డాడీ కనబడరు వికాస్‌కు

ఎనిమిదిన్నర నుండి తొమ్మిది వరకూ టేప్ రికార్డులో సంగీతం వింటూనో, ఏవైనా కథల పుస్తకాలూ, బొమ్మల పుస్తకాలూ చదువుతూనో కాలక్షేపం.

తొమ్మిది గంటలకు తప్పని సరిగా నిద్ర.

విరిత మనస్తత్వం అదో రకం. దేనికయినా సులభంగా అలవాటు పడిపోగలదు– సర్దుకపోనూ



గలదు. కానీ వికాస్ మనసు మరీ సున్నితం సున్నితమైన ఆ మనస్సు పొరల్లో ఎక్కడో ఏదో గాయమైంది. ఏదో ఏదో కావాలని ఆ లేత మనసు పదే పదే ఆరాట పడుతోంది. కానీ ఆ మనసులోని ఆరాటాన్ని అర్థం చేసుకుని ఆదరించగల వారేరీ? వికాస్ తనను అను క్షణము కనిపెట్టుకున్న సరస్వతమ్మ అర్థం చేసుకోలేనంతటి అమాయకుడు కాదు వికాస్.

సరస్వతమ్మ చిన్నయ్య పట్ల కనబరచేది ప్రేమ.

వికాస్, విరితల పట్ల చూపించేది బాధ్యత, డ్యూటీ.

అటు మొన్న, మొన్న, నిన్న, నేడు, రేపు, మరునాడు ఆ పై మరునాడు .. రొటీన్ యాంత్రికం. ఒకే గాడిలో తిరుగుతున్న జీవిత చక్రం

అందుకే అన్ని సుఖాలున్నా ఆ పసి మనసులో వెలితి.

అన్నీ అందుబాటులో నున్నా ఏదో కనబడని లోటు

వికాస్ కళ్ళు మూసుకున్నాడు. ఎందుకో నిద్ర రావటం లేదు. విరిత గుర్రు పెడుతూ హాయిగా నిద్రపోతూ వుంది వికాస్ మనసులో హఠాత్తుగా రాజేంద్ర మెదిలాడు. తల్లి ప్రక్కన పడుకుని– ఒక చేత్తో తల్లిని కావలించుకుని తృప్తిగా పడుకుని వుంటాడేమో! అప్రయత్నంగా విశాలమైన తన మంచంలో తన ప్రక్కన చూసుకున్నాడు ఖాళీ మంచం వెక్కిరించింది మనసు బాధతో మూలిగింది.

వికాస్ కళ్ళు ఎదురుగా నున్న గోడమీద నిలిచాయి.


తండ్రి వీపు మీద స్వారీ చేస్తున్న చిలిపి కుర్రాడు.

తల్లి మెడను కావలించుకున్న అందాల అమ్మాయి

తదేకంగా చూస్తూ.. చూస్తూ.. అలసి కళ్ళు మూసుకున్నాడు వికాస్.

సరిగ్గా అప్పుడు రెండుకార్లు పోర్టికోలో ఆగాయి.

విదేశీ గడియారం సంగీతం వినిపిస్తూ పదకొండు గంటలు కొట్టింది




* * *

మళ్ళీ తెల్లవారింది.

గడియారంతో పాటు యాంత్రిక దినచర్య మొదలయ్యింది వికాస్‌కు ఎంత మాత్రమూ వుత్సాహంగా లేదు. ఆయా చెప్పిన వాటిని మౌనంగా చేయించుకుంటున్నాడు.

ఎనిమిది గంటల వేళ డైనింగ్ హాల్లో బ్రేక్‌ఫాస్ట్

వికాస్ మౌనంగా గుమ్మంకేసి చూస్తున్నాడు.

రమేష్ చౌదరిగారు, గాయిత్రిగారు ఉరుకులు, పరుగులు మీద వచ్చారు వికాస్ మొహం చిన్నబోయి వుండటం వారిద్దరిలో ఎవ్వరూ గుర్తించలేదు.

'గుడ్ మార్నింగ్. '

'వెరీ గుడ్ మార్నింగ్...' పలుకరింపుల్లో కూడ యాంత్రికత్వం

'సరస్వతీ! నాకు త్వరగా వడ్డించెయ్ నే నర్జంటుగా వెళ్ళిపోవాలి. మినిస్టర్ గారీవేళ పబ్లిక్ మీటింగ్ అపెండ్ చెయ్యాల్సి వుంది.

'వారికి మీటింగ్ వుంటే నీ కెందుకోయ్ అంత తొందర'

'నేను లేకుంటే ఆ మంత్రిగారికి నోట మాటరాదు మరి'

గలగల నవ్వులు రాజకీయాలు బిజినెస్ ముచ్చట్లు మార్కెట్లు కాన్ఫరెన్సులు...

వారి మాటల్లో ప్రపంచమంతా దొర్లుతోంది తమ చిన్నారులు తప్ప. ప్రజలందర్ని 'పునరుద్ధరించగల' మంటున్న నాయకురాలికి తన పిల్లల కేంకావాలో కూడా తెలియక పోవడం విచిత్రం!

సరస్వతమ్మ హడావుడిగా వడ్డించింది.

విరిత, వికాస్ మౌనంగా తలవంచుకుని తింటున్నారు– వికాస్ మధ్య మధ్య మమ్మీ, డాడీలను గమనిస్తున్నాడు.

బ్రేక్ ఫాస్ట్ ముగిసింది. పిల్లలు కాన్వెంటుకు సిద్ధమయ్యారు– సరస్వతమ్మతో సరిగ్గా అప్పుడు తోటమాలి రంగయ్య పరుగుల మీద వచ్చాడు.

'యిగో సరసవతమ్మా... మీ సిన్నయ్యగాడు కాల్వారి రోడ్డు మీన బోర్ల బడినాడు... తలకు సిన్న గాయమైంది .. 'అమ్మో' అని గోల గోలగా ఏడుత్తున్నాడు. ..'

'ఆ!!'– సరస్వతమ్మ చేతిలోని కాన్వెంట్ బాక్సు జారింది.

సరస్వతమ్మ కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. ఆ కళ్ళనిండా ఆందోళన, భయం, ఆదుర్దా చోటు చేసుకున్నాయి. వికాస్ ఆయా ముఖంలోని భావాలు చదవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ కళ్ళలో ప్రతిబింబిస్తున్న తల్లి మనసును అర్థం చేసుకోటానికి యత్నిస్తున్నాడు.

'అమ్మగారూ....' గాయిత్రీదేవిగారి గంభీరమైన ముఖం చూసి... మాటలు గొంతులోనే ఆగిపొయ్యాయి. సరస్వతమ్మకు.

'ఇదిగో రంగయ్యా... ఆ పిల్లవాన్ని మన డాక్టరుగారి దగ్గరకు తీసి కెళ్ళండి... యిదిగో సరస్వతీ! వాడికేమీ కాదు గాని కాన్వెంటుకు ఆలస్య మవుతోంది వీళ్ళని తీసికెళ్ళు'

'అది కాచందమ్మగారూ...' ఆ తల్లి మనసు ఏదో చెప్పటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూనే వుంది.

'మమ్మీ .. పాపం ఆయాను వెళ్ళనీయండి... కార్లో మేం వెళ్ళి పోగలంలే...' సరస్వతమ్మ ఆందోళన గమనిస్తూ వికాస్అన్నాడు.

'నోర్మూసుక వెళ్ళు'

సరస్వతమ్మ, వికాస్, వెరితలు నిశ్శబ్దంగా కదిలారు.

'పిచ్చి మొహం... దెబ్బ తగిలిన పిల్లవాడికి తగిన వైద్యం కావాలిగాని... తనెళ్ళి ఏం చేస్తుంది... బ్లడీ సెంటిమెంట్స్'

ఆ మహాతల్లికి తల్లి మనసు అంతబాగా అర్థమయ్యింది మరి!

ప్రతి అవసరాన్ని 'ఖరీదుల దృష్టితో' చూట్టం తప్ప సున్నితమైన విషయాలు ఆ ప్రజా నాయకురాలికి మరో విధంగా బోధపడవు.

కార్లో కూర్చున్నా వికాస్ మనసు ఆందోళనగానే వుంది. మధ్య మధ్య చూపులు ముందుకు సారించి ఆయా చెంపల మీదుగా కారుతున్న కన్నీటిని ఆర్ద్ర హృదయంతో తిలకిస్తున్నాడు.

'ఆయాకు నేనేం సాయం చేయగలను...?'

క్లాసు రూములో కూడా వాతావరణం ఆహ్లాదకరంగా లేదు. కారణం వికాస్ మిత్రుడు రాజేంద్ర ఆ రోజు కూడా క్లాసుకు రాలేదు. అప్పటికి నాలుగురోజులుగా రాజేంద్ర కాన్వెంటుకు రాలేదు జ్వరంతో.

'అయ్యో పాపం... రాచేంద్ర జ్వరంతో ఎంత బాధ పడుతున్నాడో... పోనీ ఒకసారి చూసొస్తే... అమ్మో.. మమ్మీకి తెలిస్తే . ప్చ్.... తెలియనీ జ్వరంతోనున్న ఫ్రండును చూస్తే తప్పేమిటి... ఏమయినాసరే సాయంకాలం వెళ్ళాలి... ఎటూ మా కారు వెళ్లే దారిలో నేగా రాజేంద్ర యిల్లు ...' పాఠం వినకుండా ఆలోచిస్తున్నాడు.'

రాజేంద్ర తల్లి వికాస్ మనసులో మెదిలింది

ఆ రూపం వికాస్కు తెలియని తృప్తి నిచ్చింది.

సాయంకాలం

'డ్రైవర్! యిక్కడ కారాపు. .' వికాస్.

'అదేంటి బాబుగారూ...' సరస్వతమ్మ

'మా ఫ్రండు రాజేంద్రను చూడాలి '

'అమ్మగారు కోప్పడతారు..'

'డ్రైవర్... ఆపుతావా..దూకమంటావా... కోపంగా గద్దించాడు వికాస్. కారు సడన్గా ఆగిపొయ్యింది. తలుపు తెరచుకుని చకచకా ఆ ఇంట్లోకి వెళ్ళిపోయాడు వికాస్. వెరిత ఆశ్చర్యంగా వికాస్లోని ధైర్యాన్ని, మార్పును గమనిస్తోంది.

'రాజేంద్రా... రాజేం...'

'రా బాబూ... రా... రా... నీ ఫ్రండును పరామర్శించడానికి వచ్చావా...' ఆ తల్లి ఆదరంగా ఆహ్వానించింది వికాస్ను. రాజేంద్ర బెడ్మీద కూర్చున్నాడు నీరసంగా. జ్వరం తగ్గినా నీరసం తగ్గలేదు. ఆమె వికాస్కు బిస్కెట్లు, టీ యిచ్చింది. అంతకంటే ఎంతో ఖరీదైన బిస్కట్లు తిన్నా వాటిలోలేని రుచి ఆమె యిచ్చిన బిస్కట్లలో కనబడింది వికాస్కు.

ఆ పసి మనసుకేం తెలుసు ఆ రుచి ఆ తల్లి మనసులో నిదని!

# కన్న ప్రేమా నీ ఖరీదెంత?

'రాజేంద్రా! మీ అమ్మగారు స్కూలు కెళ్లలేదా..'

'నాకు జ్వరం వచ్చిందగ్గర్నుంచి మా అమ్మ స్కూలుకేకాదు... నా గురించిన బెంగతో అన్నం నీళ్ళు మానేసింది' నవ్వుతూ చెప్పాడు రాజేంద్ర.

'బాబూ... వాడి మాటలు నమ్మకేం .. నా ఆందోళన, భయం వాడికే వాడికెగతాళిగానే వుంటుంది....'

వికాస్మనసులో ఉదయం సరస్వతమ్మ ముఖం మెదిలింది. మరుక్షణం... ఆయాను శాసిస్తున్న మమ్మీ ముఖం మెదిలింది.

అను క్షణం తల్లి యిలా కనిపెట్టు కున్నప్పుడు నాలుగైదు రోజులు జ్వరమొచ్చినా సరేబలే సుఖంగా వుంటుందని పించింది. ఆ వాతావరణాన్ని, ఆ తల్లి శ్రద్ధను, ఆందోళనను, ప్రేమను గమనిస్తున్న వికాస్కు.

అరగంట తర్వాత మనసు కదలనని మొరాయిస్తున్నా కదిలాడు.

వికాస్ మనసిప్పుడు తేలికగావుంది.

ఆ రాత్రి కళ్ళు మూసుక పడుకున్నా వికాస్ మనసులో ఉదయం జరిగినసంఘటన సాయంత్రం రాజేంద్ర యింట్లోని దృశ్యం పదేపదే కదలాడాయి.

ఆ రెండు దృశ్యాల్లోని భేదాన్ని కూడా ఆ లేత మనసు చాలావరకు గ్రహించ గలిగింది.

* * *

వికాస్ మనసులో మార్పు ప్రారంభమయ్యింది. తనుకోరుకున్నది రోజు రోజుకూ తనకు దూర మవుతున్నందుకు బాధ... అవమానం.

ఆ బాధ, అవమానాల్లో నుంచి కసి...

ఆ సాయంకాలం

చిన్నయ్యతో కలిసి మట్టిలో ఆడుకుంటున్నాడు. ఇసుకలో దొర్లాడు. వీధిలో బండివాడు అమ్ముతున్న ఐస్ఫ్రూట్ కొనుక్కున్నాడు. కావాలని బట్టలు మాపేసుకున్నాడు. ట్యూషన్ మేడమ్తో తగువు పెట్టుకున్నాడు.

మర్నాడు

ఉదయం ఎనిమిదయినా మంచం దిగలేదు. టిఫిన్ ప్లేటు విసిరేశాడు. వంట మనిషితో పోట్లాట వేసుకున్నాడు. అలిగి కాన్వెంటు మానేశాడు.

కావాలనే... అర్థంకాని కసితో గడియారానికి ముడివడ్డ తన దినచర్యను బలవంతంగాబద్దలు చేశాడు.

ఆయా వద్దంటున్నా వినకుండా మధ్యాహ్నం ముసుగుతన్ని రాజాలా నిద్రపోయాడు.

గాయత్రీదేవిగారికి సరస్వతమ్మ వికాస్ను గురించి ఫిర్యాదు చేసింది.

వికాస్ చేస్తున్న అల్లరి వెనుక, ఆగడం వెనుక ఆ పసి మనసు కోరుతున్నదేదో అర్థం చేసుకోగల నేర్పు, ఓర్పు, సహృదయత, వివేచన, ఆడమనసు ఆ గొప్పింటి యిల్లాలుకు లేవు.

వికాస్ను తన గదికి పిలిపించింది. వాడిని లాలించి. బుజ్జగించి విషయంతెలుసుకోడానికి బదులు పిచ్చుక మిద బ్రహ్మాస్త్రాన్ని సంధించింది.

వికాస్ అంతరాంతరాల్లో మమ్మీని ఎదిరించాలన్న కసి... ఎదురు తిరిగాడు. మాటకు మాటాఅన్నాడు.

గాయత్రీదేవిగారి మనసు కోపంతో కుత కుత వుడికింది.

'కుర్ర కుంక.. నాకే యెదురు తిరుగుతాడా రాస్కెల్....'

వికాస్ చెంపలు చెళ్ళుమన్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తున్న సరస్వతమ్మ గుండెలు జల్లుమన్నాయి. సరస్వతమ్మను కూడా తీవ్రంగా కేకలేశారు.

తనే దగ్గరుండి బలవంతంగా కారెక్కించి కాన్వెంటుకు పంపారామెగారు వికాస్ను. వికాస్ గురించి కాన్వెంటు ప్రిన్సిపాల్గారికి ఫోన్ చేశారామె.

ఆ తర్వాత తన బాధ్యత తీరినట్లు తృప్తిగా నిట్టూర్చి కిండర్గార్డన్ స్కూల్లో చిన్న పిల్లలకు 'సందేశాన్నందించటానికి కారెక్కారు.

సాయంకాలం

ఇంటికి వచ్చీ రాగానే వికాస్ మంచమెక్కాడు జ్వరంతో. శరీరం కాలిపోతున్న పెనంలాగా వేడిగా వుంది. కళ్ళు మూసుక పడుకున్నాడు.

సరస్వతమ్మ అయ్యగారికీ, అమ్మగారికీ ఫోన్ చేసింది.

'తాము రావటం ఆలస్యం కావచ్చు... డాక్టరుగారికి ఫోన్ చెయ్– ఫోనులో నుండి ఆయాకు ఆదేశం.

డాక్టరుగారు, నర్సు వచ్చారు. ఇంజక్షన్ యిచ్చి అరగంట కూర్చున్నారు. అయ్యగారుగాని రాలేదు. నర్సుకు వాడవలసిన మందుల గురించి వివరంగా చెప్పి అవసర మయితే తనకు ఫోన్ చెయ్యమని చెప్పి డాక్టరుగారు వెళ్లారు.

గంట తర్వాత వికాస్ కళ్ళు తెరిచాడు.

'ఆయా... మమ్మీ రాలేదా...' కంఠం నిండా ఆతురత.

'రాలే...దు...వస్తా...మన్నారుబాబు...గారు.'

వికాస్ కళ్ళు మూసుకున్నాడు. మూతలుపడ్డ ఆ రెప్పల వెనుక రాజేంద్ర, రాజేంద్ర తల్లి కదులుతున్నారు. తన తల్లి ఆందోళన గురించి, పరిచర్యల గురించి రాజేంద్ర నవ్వుతూ చెప్పిన విషయాలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

అర్ధరాత్రిదాకా మమ్మీ కోసం.. అరగంటకోసారి అడిగి... అడిగి .. నిరాశతో నిద్రపోయాడు. వికాస్ మనసు అసంతృప్తితో కాలిపోతోంది. డాక్టరుగారు శరీరం వేడి తగ్గించ గలిగారు కాని... మనసులోని మంటల నార్ప గలిగారా?

ఆ మనసుకు మందు మరోచల్లని మనసు మాత్రమే అందివ్వగలదు

మరి– ఆ 'మనసుకు' అలాటి సున్నిత విషయాలు అర్థం కావు. అర్థమయినా తీరిక వుండదు.

మరునాడు వుదయమే ఫోన్ చెప్పింది....

'అమ్మగారు రాత్రి జిల్లా పర్యటనకి వెళ్లారని... నాలుగు రోజులదాకా రారని'అయ్యగారు ఆ ముందురోజే బిజినెస్ కాన్ఫరెన్సుకి బొంబాయి వెళ్లారట.!

ఆ సంఘటనతో వికాస్ మనసు మరికోలుకోలేనంతగా గాయపడింది.

వారం రోజుల తర్వాత జ్వరం తగ్గింది. కానీ ఎవ్వరితోనూ మాట్లాడటం మానేశాడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న భావన.....

మరునాడు వుదయం డైనింగ్ టేబిల్ దగ్గర

'వికాస్‌కు మన సిటీలోని కాన్వెంట్ సూటయినట్లులేదు. మద్రాస్ పబ్లిక్‌స్కూల్లో చేర్పిద్దాం... మిరేమంటారు....' గాయిత్రీదేవిగారు అడిగారు.

'నో నే చేరను' వికాస్ లేచి వెళ్ళిపోయాడు నిరసనగా, కోపంగా

'కుర్ర వెధవ... వాడికేం తెలుసు...... స్కూల్ సీటు రిజర్వ్ చేశా... రేపే ప్రయాణం'

'నీ యిష్టం .. పిల్లల గురించి నీకంటే నాకు తెలుసా?–' భర్త జవాబు.

రెండు రోజుల తర్వాత వికాస తప్పనిసరిగామనసు చంపుకొని కన్నీళ్ళతో కారెక్కాడు. మద్రాస్ పబ్లిక్ స్కూల్లో చేర్పించి, తృప్తిగా నిట్టూర్చారు గాయిత్రీదేవిగారు.

ఓ నెల తర్వాత

'వికాస్ సీరియస్ స్టార్ట్ యిమీడియట్లీ' మద్రాస్ పబ్లిక్ స్కూల్ నుండి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చింది. గాయిత్రీదేవిగారు, రమేష్‌చౌదరిగారు మద్రాసు చేరుకున్నారు.

వికాస్ హాస్పిటల్లో బెడ్‌మీద మగతలో వున్నాడు.

'ఏమయింది డాక్టర్'

డాక్టర్‌గారి ప్రక్కనున్న పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వివరించారు.

'వికాస్ ఎందుకో ఈ వాతావరణానికి అడ్జస్ట్ కాలేకపోయాడు. ఎప్పుడూ డల్‌గా వుండేవాడు. ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్‌తో బాధ పడుతుండేవాడు. మొన్న క్లాస్‌లో టీచరు పాఠం చెపుతున్నారు. అందులో ఓ బీద తల్లి తను ప్రాణాధికంగా ప్రేమించే తన కొడుకు... ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకున్నప్పుడు...వాడిని రక్షించుకోటానికి మంటల్లోకి దూకుతుంది ఆ తల్లి. కొడుకును రక్షించ గలుగుతుంది కాని... ఆ మంటల్లో ఆమె చనిపోతుంది. అప్పుడు వికాస్ పిచ్చివానిలా లేచి... నో నో ఆ తల్లి చనిపోవటానికి వీల్లేదని 'కేకలేస్తూ స్పృహ తప్పి పడిపోయ్యాడు. ఇక్కడకు చేర్పించిం తర్వాత కూడా ఆ తల్లి గురించి, తల్లి ప్రేమ గురించి మధ్య మధ్య అర్థం లేకుండా ఏవేవో మాట్లాడుతూనే వున్నాడు.....'

గాయిత్రీదేవిగారి కళ్ల వెంట కన్నీళ్ళు.

రమేష్‌చౌదరిగారు బలవంతంగా కన్నీళ్ళు ఆపుకుంటున్నారు.

ఆ తల్లి చెక్కిళ్ల మీదుగా ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళు యిన్నేళ్ళుగా మనసుకు పట్టిన మురికిని శుభ్రంగా కడిగివేస్తున్నాయి.

కన్నీటి కారు మబ్బులు కమ్మిన ఆమెగారి ముఖంలో యిపుడు ఆడ మనసు' కనబడుతోంది. వేగంగా ఆందోళనగా కొట్టుకుంటున్న ఆ గుండెల్లో 'తల్లి మనసు' రేకులు విచ్చుకుంటోంది. తను యిన్నేళ్ళుగా చేస్తున్న తప్పేమిటో యిపుడు స్పష్టంగాఅర్థమవుతోంది.






'బాబూ' బావురుమన్నారు గాయిత్రీదేవిగారు. 'భగవాన్... నా బాబును బ్రతికించు తండ్రీ... డాక్టర్... నా కొడుకును బ్రతికించండి... ప్లీజ్.... ఏడుస్తూ 'తల్లి'గా బ్రతిమాలుతున్నారు.

జీవితంలో మొదటిసారిగా తన కన్న కడుపు కోసం కన్నీళ్ళు కారుస్తున్నారు గాయిత్రీదేవిగారు.

గంట గడిచింది.

వారిద్దరినీ కొన్ని యుగాలు గడిచిన అనుభూతి.

వికాస్ మెల్లిగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగుండా కన్నీళ్ళతో, ఆందోళనతో మమ్మీ, డాడీలు.

వికాస్ మనసులో మాటల కందని తృప్తి.

మళ్ళీ అలసటా కళ్ళు మూసుకున్నాడు. మూసుకున్న ఆ కళ్ల వెనుక తన గది గోడకు వేలాడుతున్న రంగు రంగుల క్యాలెండర్....

కానీ

ఆ క్యాలెండర్‌లో తన డాడీ వీపు మీద తను రాజాలా కూచున్నాడు.

మమ్మీ మెడను కావలించుకుని విరిత చిరునవ్వులు చిందిస్తోంది.

అలసిన ఆ చిన్నారి ముఖం మీద తరగని ఆనంద రేఖ. □